ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.29.08.2025 సమయం.1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సమావేశాలు ఎన్ని రోజులు కొనసాగుతాయనే అంశాన్ని సభా వ్యవహారాల సంఘం రేపు నిర్ణయిస్తుంది.
2. మెదక్, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల నిరాశ్రయులైన వారికి అధికార యంత్రాంగం సహాయ, పునరావాస కార్యక్రమాలను విస్తృతంగా అందిస్తోంది.
3. ఈరోజు జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేపట్టారు.
4. ఈరోజు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

శాసనసభ సమావేశాలు

రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సమావేశాలు ఎన్ని రోజులు కొనసాగుతాయనే అంశాన్ని సభా వ్యవహారాల సంఘం రేపు నిర్ణయిస్తుంది. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు సమీక్షా నివేదికను ఈ సమావేశాల్లోనే సభ ముందుకు తీసుకువచ్చే అవకాశం వుంది. అలాగే రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులపై సభలో చర్చ జరిగే అవకాశం వుంది. సమావేశాల నేపథ్యంలో శాసనసభ పరిసరాల్లో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇలా ఉండగా, బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన ఎమ్.ఎల్.ఏలు, ఏమ్.ఎల్.సీలతో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమావేశమై, సభలో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించారు. అలాగే బి.ఆర్.ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు, పార్టీ ఎమ్.ఎల్.ఏలు, ఎమ్.ఎల్.సీలు, సీనియర్ నేతలతో సమావేశమై అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.

ఎమ్.ఎస్.ఎల్ / డెస్క్

వరద సహాయం

మెదక్, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల నిరాశ్రయులైన వారికి అధికార యంత్రాంగం సహాయ, పునరావాస కార్యక్రమాలను విస్తృతంగా అందిస్తోంది. నిర్మల్ జిల్లాలో రెండు పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి, 15 కుటుంబాలకు అధికారులు ఆశ్రయం కల్పించారు. వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించి, భారీ వర్షాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలతో మాట్లాడారు. ప్రభావిత కుటుంబాలకు తక్షణ సహాయ, సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

కామారెడ్డి జిల్లాలో ఎన్.డి.ఆర్.ఎఫ్ బృందాలు వరదల్లో చిక్కుకున్న చిన్నారులు, వృద్ధులు, మహిళలను బోట్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధితులకు మద్నూరు ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక భోజన, వసతి, వైద్య సదుపాయాలు కల్పించారు.

మెదక్ జిల్లాలో పలుచోట్ల పునరావాస శిబిరాల్లో వరద బాధితులకు జిల్లా అధికార యంత్రాంగం భోజనవసతి, సహాయ సహకారాలను అందిస్తోంది. జిల్లాలో పలు గ్రామాలకు

వరదల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టింది. కాగా, వర్షం తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రజలు అప్రమత్తంగా వుండాలని అధికారులు సూచించారు.

పిటిసి కామారెడ్డి, మెదక్, నిర్మల్

కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాల కారణంగా NH-44 జాతీయ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో నిజామాబాద్-హైదరాబాద్ మార్గంలో వెళ్ళాల్సిన వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర సూచించారు. నాలుగు లేన్లలో రెండు లేన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, నిన్న మరమ్మతు చేసిన రోడ్డు కూడా కృంగిపోవడంతో ప్రస్తుతం ఒక్క లైన్ మాత్రమే అందుబాటులో ఉండగా, అత్యవసర వాహనాల కోసం ఆ దారిని వినియోగిస్తున్నామని తెలిపారు. వాహనదారులు మేడ్చల్, ఆర్మూర్, నిర్మల్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ డైవర్షన్‌ను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

పిటిసి కామారెడ్డి

మూసీ వరదలు

భువనగిరి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. రుద్రవల్లి వద్ద వంతెన, పోచంపల్లి – బిబినగర్ మధ్య వరద నీరు చేరడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అలాగే భీమలింగం దగ్గరలోని బ్రిడ్జిపైన వరద ఉధృతి కారణంగా చౌటుప్పల్ – భువనగిరి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

పిటిసి యాదాద్రి భువనగిరి

పంట నష్టం

గత రెండు రోజులుగా అసిఫాబాద్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైతులు పంటలు కోల్పోయారని, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు

నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని, అర్హులైన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఈ రోజు మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నష్టాలను అంచనా వేసి, వెంటనే నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

(సౌండ్ బైట్ వెంకటేశ్ ధోత్రే)

పిటిసి అసిఫాబాద్

**BREAK**

ఆకాశవాణి వార్తలు వింటున్నారు. మరిన్ని Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ airnews_hyd ని ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

కె.రామకృష్ణారావు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు పదవీ కాలానికి సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా, కేంద్ర ప్రభుత్వం మరో 7 నెలలు పాటు పొడిగించింది. ఈ మేర 2026 మార్చి 31 వరకు రామకృష్ణారావు పదవీకాలం పొడిగిస్తూ DOPT ఉత్తర్వులు జారీ చేసింది.

డెస్క్

స్పోర్ట్స్ డే

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని, క్రీడల వల్ల సమైక్యత, సౌజన్యం, సామరస్యం వెల్లివిరుస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోది అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న

జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, ధ్యాన్ చంద్ నైపుణ్యం, క్రీడా స్ఫూర్తి తరతరాలకు చైతన్యం కల్గిస్తుందని మోది పేర్కొన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన నివాళులర్పించారు. జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని క్రీడాకారులకు, క్రీడాభిమానులకు ఈరోజు హైదరాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయంలోకి ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.

డెస్క్

మెదక్ – స్పోర్ట్స్ డే

యువతను క్రీడల వైపు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఈ ఉదయం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి తో కలిసి రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీని ఇరువురూ జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. క్రీడాకారులను గౌరవించాలనే లక్ష్యంతో కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సూక్ మాండవీయా ఈరోజు ఒక లోగోను, పోర్టల్, ఒక స్కానర్ ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

(సౌండ్ బైట్ : ఎంపీ రఘునందన్ రావు)

పిటిసి మెదక్

ఆర్చరి

ప్రపంచ ఆర్చరీ పోటీల్లో తన ప్రతిభను చాటి, దేశ కీర్తి పతాకం ఎగరవేసి, మొదటిసారి రాష్ట్రానికి తిరిగి వచ్చిన చికిత తానిపర్తికి శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్.ఎల్.సి బల్మూరి వెంకట్, ఎమ్.ఎల్.ఏ విజయ రమణారావు, స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.

ఎమ్.ఎస్.ఎల్

భద్రాద్రి కొత్తగూడెం – స్పోర్ట్స్

క్రీడలు ఆత్మ విశ్వాసానికి, శారీరక, మానసిక దారుఢ్యానికి ఎంతో ఉపకరిస్తాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడాదినోత్సవం వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

(సౌండ్ బైట్ – జితేష్ వి.పాటిల్)

పిటిసిభద్రాద్రి కొత్తగూడెం

తెలుగు భాష – రాజన్న సిరిసిల్ల (సౌండ్ బైట్)

ఈరోజు తెలుగు భాషా దినోత్సవం. వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ప్రారంభించి, గ్రాంధిక భాషా స్థానంలో ప్రజలు మాట్లాడే భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు విశేష ప్రాచుర్యాన్ని కల్పించారు. ఆగస్టు 29 ఆయన జయంతి సందర్భంగా, ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాము. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

రాజన్న సిరిసిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహిత్యకారుడు, సినీ గేయ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఆకాశవాణితో మాట్లాడుతూ... తెలుగు భాష ఒక మాధ్యమం మాత్రమే కాదని, భాషా సంస్కృతులకు నెలవని అభివర్ణించారు.

(సౌండ్ బైట్ అశోక్ కుమార్)

పిటిసి రాజన్నసిరిసిల్ల

వాతావరణం

రాగల 48 గంటల్లో తెలంగాణలోని అదిలాబాద్, అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం వుందని వాతావరణ కేంద్రం పేర్కొంది. అలాగే భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్,

హైదరాబాద్ జిల్లాలలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం కురుస్తుందని వెల్లడించింది.

పి.ఎస్

రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ లోకి మూడు పంపుల ద్వారా నీటిని దిగువకు వదలుతున్నారు. ఈ రిజర్వాయర్ 3.5 టీఎంసీల సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 1.35 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

పిటిసి రాజన్నసిరిసిల్ల

**CLOSING**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు ప్రసారమవుతాయి.